సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 8 । అక్టోబర్ । 2025



'వసతి'కి తాళం

గిరిజన సంక్షేమ శాఖ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో సిబ్బంది సమ్మెతో సెలవులు ముగిసినా పూర్తిస్థాయిలో తెరుచుకోలేదు. 8లో



పీఠాన్ని కైవసం చేసుకుంటాం

జిల్లా పరిషత్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాంతారావు ధీమా వ్యక్తం చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 24°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత మరింత పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లి సన్నిధిలో చండీహోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కేశవాపురం – జగన్నాథపురం మధ్య కొలువైన శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం చండీ హోమం నిర్వహించారు. తొలుత మేళతాళాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ స్వామి వారిని ఊరేగింపుగా తీసుకెళ్లగా, మండపారాధన, గణపతి పూజ అనంతరం చండీహోమం చేశారు. ఈ పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అతర్వాత శివాలయంలో సుబ్రమణ్యేశ్వరస్వామికి పంచామృతంతో అభిషేకం నిర్వహించారు.

స్థానిక ఎన్నికలకు హెల్ప్‌డెస్క్

చుంచుపల్లి: ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యాన కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశాలతో కలెక్టరేట్‌లో 24 గంటల పాటు పనిచేసేలా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని జెడ్పీ సీఈఓ బి.నాగలక్ష్మి వెల్లడించారు. ఇందులో లైజినింగ్ ఆఫీసర్లుగా అదనపు డీఆర్‌డీఓ రవికుమార్, సీనియర్ ఉపాధ్యాయుడు పి.సాయికృష్ణ వ్యవహరిస్తారని తెలిపారు. ఎన్నికల సమాచారం కోసం 85018 50264, 93966 54181 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎన్నికల వేళ మరింత అప్రమత్తత



డీఎస్పీ, ఉద్యోగులతో సమీక్షిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: స్థానిక సంస్థల సమీపిస్తున్న వేళ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేక నిఘా వేయాలని ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశించారు. కొత్తగూడెం డీఎస్పీ కార్యాలయానికి మంగళవారం సందర్శించిన ఆయన డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ఉద్యోగులతో సమావేశమయ్యారు. సబ్ డివిజన్ పరిధి పోలీసు స్టేషన్ల నమోదైన కేసులు, విచారణపై ఆరా తీశాక ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు, వ్యాపారులు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అలాగే, ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎన్నికల వేళ సమస్యాత్మక గ్రామాలపై నిఘా వేసి పాత నేరస్తులను కదలికలను గమనించాలని సూచించారు. సీఐలు ఎం.కరుణాకర్, ప్రతాప్, శివప్రసాద్, వెంకటేశ్వర్లుతో ఎస్సైలు పాల్గొన్నారు.

కళ్ల ముందే సాగర తీరం!

పగిడేరులో వేడినీరు ఉబికి వస్తున్న ప్రాంతం



సముద్రతీర ప్రాంతం లేని తెలంగాణలో కృత్రిమ బీచ్‌ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అందులో భాగంగా హైదరాబాద్‌లోని కొత్వాల్‌గూడ దగ్గర రూ.225 కోట్లతో 35 ఎకరాల్లో కృత్రిమ బీచ్ ఏర్పాటుకు సిద్ధమైంది. హైదరాబాద్ తరహాలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ కృత్రిమ బీచ్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. గోదావరి తీర ప్రాంతంలోని మణుగూరు మండలం పగిడేరు సమీపంలో ఉన్న వేడినీటి ఊటలు (ఉష్ణగుండాలు) కేంద్రంగా పర్యాటక అభివృద్ధికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇందుకు జిల్లా యంత్రాంగం, సింగరేణి సంస్థ సహకారం అందించనున్నాయి. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

పగిడేరులో కృత్రిమ బీచ్ ఏర్పాటుకు సన్నాహాలు

- ఇక్కడ భూమి నుంచి సహజసిద్ధంగా ఉబికి వస్తున్న వేడినీరు
- ఈ నీటి ఆధారంగా బీచ్.. పర్యాటకంగా అభివృద్ధికి ప్లాన్
- సింగరేణి నుంచి సాంకేతిక, ఆర్థిక సహకారం

సహజసిద్ధంగా వేడినీరు

గోదావరి తీర ప్రాంతంలో చమురు నిక్షేపాల కోసం 70, 80వ దశకంలో ఆయిల్, నేచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఓఎన్‌జీసీ) అన్వేషణ సాగించింది. ఈక్రమాన అనేక చోట్ల బోర్లు వేయగా మణుగూరు మండలం పగిడేరు వద్ద వేసిన ఓ బోరు నుంచి నిత్యం వేడి నీరు బయటకు వస్తోంది. ఆర్టిసన్ వెల్స్‌గా వీటిని పిలుస్తారు. భూమి లోపలి పొరల్లో ఉండే నీరు విపరీతమైన వేగంతో బండరాళ్ల గుండా ప్రవహించినప్పుడు ఏర్పడే రాపిడితో నీరు వేడెక్కుతుంది. పగిడేరు వద్ద ఉబికి వచ్చే నీరు 70 – 80 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రతతో ఉంటుంది. ఇక్కడ వేడినీటి ఊటల ఆధారంగా 20 కిలోవాట్ల సామర్థ్యంతో జియో థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు సింగరేణి ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు చేపట్టింది. ఈ మేరకు రెండేళ్లుగా ప్రయోగాలు జరుగుతున్నాయి.

ఉష్ణగుండాలు

హిమాలయ పర్వత శ్రేణుల్లో విస్తరించిన అనేక పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాల దగ్గర ఉష్ణగుండాలు ఇటు పర్యాటకులను, అటు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. హిమాచల్‌ప్రదేశ్‌లోని మణికరణ్, ఉత్తరాఖండ్‌లోని గౌరీకుండ్, తపోవన్ వంటి ప్రదేశాల్లో సహజసిద్ధంగా భూమిలో నుంచి వేడి నీరు బయటకు వస్తుంది. వీటిని పవిత్ర ప్రదేశాలుగా పరిగణిస్తూ అక్కడకు వెళ్లే భక్తులు స్నానాలు ఆచరిస్తారు. మెగ్నీషియం, సల్ఫర్, సోడియం, కాల్షియం వంటి ఖనిజాలను కలిగిన ఈ నీటిలో స్నానం చేయడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని భక్తుల నమ్మిక. అలాగే, టైర్ వన్ సిటీల్లో కొత్తగా వెలుస్తున్న వెల్‌నెస్ సెంటర్లలోనూ 'హాట్ వాటర్ థెరపీ'లు అందుబాటులో ఉన్నాయి.

కృత్రిమ బీచ్ ఏర్పాటుతో..

పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం టూరిజం పాలసీని ప్రకటించింది. అందులో భాగంగానే తెలంగాణలో కృత్రిమ బీచ్‌ల ఏర్పాటుకు నిర్ణయించారు. పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉండే హైదరాబాద్‌లో ఆర్టిఫీషియల్ బీచ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా ఇప్పుడు వేడి నీటి ఊటల ఆధారంగా పగిడేరులోనూ బీచ్ ఏర్పాటుకు పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఉబికి వచ్చే వేడి నీటిని సమీప ప్రాంత రైతులు నేరుగా ఉపయోగించడం లేదు. మడుల్లో నిల్వ చేసి చల్లారాక పొలాలకు పారిస్తున్నారు. ఇలాంటి మడుల దగ్గరే ఇసుక రాశులను భారీగా పోయడం ద్వారా కృత్రిమ బీచ్ ఏర్పాటు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉంది.

సింగరేణి సహకారం

భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం ఉండడంతో జిల్లాలో టెంపుల్ టూరిజం ఉన్నత స్థాయిలో ఉంది. ఏపీలోని పాపికొండలు, మారేడుమిల్లికి వెళ్లే పర్యాటకులు జిల్లా మీదుగానే రాకపోకలు సాగిస్తారు. ఇక పాల్వంచ మండలం కిన్నెరసాని వద్ద కూడా ఏకో టూరిజం అభివృద్ధి పనులు సాగుతున్నాయి. ఇలా జిల్లాకు వచ్చే పర్యాటకులకు మరో ఆకర్షణగా ఈ కృత్రిమ వేడి నీటి బీచ్‌ను అందుబాటులోకి తీసుకురావాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. ఈమేరకు రెవెన్యూ సంబంధిత వ్యవహారాలు జిల్లా యంత్రాంగం చూసుకోనుండగా,



ఇటీవల పగిడేరు వద్ద స్థానికులతో చర్చిస్తున్న కలెక్టర్ పాటిల్

ఇక్కడ జియో థర్మల్ పవర్ ప్లాంట్ పైలట్ ప్రాజెక్టు చేపడుతున్న సింగరేణి ఈ ప్రదేశాన్ని బీచ్‌గా మార్చేందుకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక సహకారం అందించనుంది. బొగ్గుతో మొదలైన సింగరేణి ప్రస్థానం థర్మల్, సోలార్ పవర్‌లోనూ తన సత్తా చాటుతోంది. తాజాగా రేర్ ఎర్త్ మినరల్స్ మైనింగ్‌తో పాటు పర్యాటక రంగంలోనూ పాదం మోపనుంది. ఇప్పుడు కృత్రిమ బీచ్ ఏర్పాటు ప్రతిపాదనలు కార్యరూపం దాలిస్తే సింగరేణి మరో అడుగు ముందుకేసినట్లవుతుంది.

భక్త శబరికి స్మృత్యంజలి



స్వామి వారికి ఫల, పుష్పాంజలి చేస్తున్న అర్చకులు



గిరిజన పెద్దలకు వస్త్రాలు అందజేస్తున్న పీఓ రాహుల్, ఈఓ దామోదర్‌రావు

- గిరిజనుల ఆటపాటల నడమ భద్రగిరి ప్రదక్షిణ
- రామయ్య కల్యాణంలో పాల్గొన్న గిరిజనులు

భద్రాచలం: గిరిజనుల ఆటపాటలు, కొమ్ము నృత్యాలు, వారి సంస్కృతి, సంప్రదాయాల నడుమ భక్త శబరికి స్మృత్యంజలి ఘటించారు. భద్రాద్రి రామయ్యకు అపర భక్తురాలు, ప్రేమ, భక్తితో ఆయనకు ఎంగిలి పండ్లు సమర్పించిన శబరికి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం శబరి స్మృతి యాత్ర వైభవోపేతంగా నిర్వహించారు. దేవస్థానంలో 2013 నుంచి ఏటా అశ్వయుజ మాసంలో పౌర్ణమి రోజున యాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఫల, పుష్పాలతో నీరాజనం

యాత్ర నిర్వహణ కోసం వివిధ ప్రాంతాల గిరిజనులను బస్సుల్లో భద్రాచలం తీసుకొచ్చారు. మంగళవారం ఉదయమే శబరి చిత్రపటంతో మేళతాళాలు, భక్తుల శ్రీరామ నామస్మరణ నడుమ గిరి ప్రదక్షిణ చేశారు. ఆతర్వాత చప్టా దిగువన తూము రామదాసు, భక్త రామదాసు విగ్రహాలకు ఆలయ ఈఓ కొల్లు దామోదర్‌రావు పూలమాలలు, శబరి విగ్రహం వద్ద పూలు, పండ్లు, వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా గిరిజనుల సంప్రదాయ నృత్యాలు అలరించాయి. వీరితో పాటుగా ఈఓ దామోదర్‌రావు, ఇతర అధికారులు కొమ్ము పాగా ధరించి కాలు కదిపారు అనంతరం బేడా మండపంలో కొలువైన స్వామితో పాటు శబరికి గిరిజనులు పండ్లు, పూలను సమర్పించాక అర్చకులు పూజలు చేశారు. ఆపై చిత్రకూట మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం జరిపించగా గిరిజనులు కనులారా వీక్షించారు. కాగా, ఈ ఉత్సవంలో ఐటీడీఏ పీఓ బి.రాహుల్ పాల్గొని గిరిజన పెద్దలకు వస్త్రాలు, పూలు, పండ్లు అందజేసి సత్కరించారు. అలాగే, వాల్మీకి జయంతి కూడా నిర్వహించారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని వరరామచంద్రాపురంలో శబరి నది వద్ద దేవస్థానం అర్చకులు పూజలు చేశారు. నది ఒడ్డున శబరి విగ్రహానికి అభిషేకం నిర్వహించారు.



సేవా యాత్రలో గిరిజనుల సంప్రదాయ నృత్యం

కుమురం భీం ఆశయస్ఫూర్తిని కొనసాగించాలి

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజన హక్కుల సాధనతో పాటు జల్ జంగిల్ జమీన్ నినాదంతో పోరాడిన ధీరుడు కుమురం భీం ఆశయ స్ఫూర్తిని గిరిజన యువత కొనసాగించాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సూచించారు. ఐటీడీఏ సమావేశం మందిరంలో మంగళవారం కుమురం భీం 85వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పీఓ నివాళులర్పించి మాట్లాడారు. నిజాం పాలకులకు వ్యతిరేకంగా గిరిజనులను ఏకం చేసి మన్యంలో పోరాటం సాగించిన భీం ఆదర్శప్రాయుడయ్యారని తెలిపారు. ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అశోక్, గురుకులాల ఆర్‌సీఓ అరుణకుమారి, అధికారులు ఉదయ్‌కుమార్, భాస్కర్, మధుకర్, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదికర్మ యోగి నివేదిక సిద్ధం

గిరిజన ఆవాసాల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన నివేదికలు సిద్ధం చేస్తున్నామని ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ సెక్రటరీ సర్వేశ్వర్‌రెడ్డి మంగళవారం ఆదికర్మ యోగి పథకంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించారు. గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం అమలుచేస్తున్న పథకాన్ని విజయవంతం చేసేలా నివేదికలను త్వరగా పంపించాలని సూచించారు. ఈమేరకు భద్రాచలం నుంచి ఏపీఓ మాట్లాడుతూ భద్రాచలం ఐటీడీఏ పరిధి 19 మండలాల్లోని 130 గ్రామాల్లో సమస్యలను గుర్తించామని తెలిపారు. వీసీలో టీసీఆర్‌టీఐ డైరెక్టర్ సమజ్వాల, ఉద్యోగులు పాల్గొన్నారు.



భీం చిత్రపటానికి పూలమాల వేస్తున్న పీఓ రాహుల్

కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి

సూపర్‌బజార్(కొత్తగూడెం)/కొత్తగూడెం టౌన్: వాల్మీకి మహర్షి జయంతిని కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పూలమాలలు వేసి నివాళులర్పించాక మాట్లాడారు. వాల్మీకి రామాయణం ఆధారంగా హితోక్తులు పాటిస్తే అందరూ ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని తెలిపారు. బీసీ సంక్షేమాధికారి పి.విజయలక్ష్మి, బీసీ సంక్షేమ సంఘం, వాల్మీకి బోయ సంఘాల నాయకులు నాయకులు కొదుమూరి సత్యనారాయణ, ముదురుకోళ్ల కిషోర్, ఎం.వెంకన్న, బి.నందకిషోర్, ఎం.శ్రీనివాస్, కె.సాంబయ్య, గుమలాపురం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే, కొత్తగూడెంలోని ఎస్పీ కార్యాలయంలో వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్య స్వామి పూలమాల వేసి నివాలర్పించారు. అధికారులు, సిబ్బంది సత్యనారాయణ, సుధాకర్, లాల్ బాబు, కృష్ణారావు, మంజ్యానాయక్ పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటం వద్ద కలెక్టర్, ఉద్యోగులు

గ్రామాల్లో ఆశావర్కర్లే కీలకం : డీఎంహెచ్ఓ

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో ఆశా వర్కర్లదే కీలకపాత్ర అని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జయలక్ష్మి తెలిపారు. అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంటలోని పీహెచ్‌సీని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యసేవలపై ఆరా తీశాక గర్భిణులను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవించేలా అవగాహన కల్పించాలని ఉద్యోగులు, ఆశా వర్కర్లకు డీఎంహెచ్ఓ సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రియాంక, తన్మయ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏటీసీతో యువతకు ఉజ్వల భవిష్యత్

మణుగూరు రూరల్: అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)లో ఇచ్చే శిక్షణతో నిరుద్యోగ యువతకు ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. మండలంలోని ముత్యాలమ్మనగర్ ఐటీఐ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఏటీసీని మంగళవారం పరిశీలించిన ఆయన పెండింగ్ పనుల పూర్తిపై సూచనలుచేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ యువతకు సాంకేతికత శిక్షణను చేరువ చేయాలనే భావనతో ప్రభుత్వం ఏటీసీలను ఏర్పాటు చేస్తోందన్నారు. ఐటీఐ ప్రిన్సిపాల్ జి.రవి, సూపరింటెండెంట్ టీఎస్.జ్యోతిరాణి, ఏటీఓలు ఎం.శ్రీనివాసరావు, జీవీ.కృష్ణారావు, ఏ.నర్సయ్య, వేణుగోపాల్, సిబ్బంది పూర్ణచందర్‌రావు, సూనాథ్ అశోక్, శ్రావణి, చందు పాల్గొన్నారు.



పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్

ముహూర్తం కుదరడం లేదు..

- వైన్స్‌కు 11 రోజుల్లో 18 దరఖాస్తులే
- స్థానిక ఎన్నికల వేళ ఆశావహుల ఊగిసలాట
- గడువు పెంపు ప్రచారంతో వేచిచూస్తున్న పలువురు

కొత్తగూడెంఅర్బన్: కొత్త మద్యం పాలసీలో భాగంగా వైన్స్ కేటాయింపునకు గత 25న నోటిఫికేషన్ విడుదలైంది. ఈమేరకు 26వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణకు కొత్తగూడెంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆ వెంటనే అమ్మవారి నవరాత్రులు, ఆ తర్వాత దసరా రావడంతో టెండర్లు అందలేదు. దసరా తర్వాత మొదలైనా ఇప్పటివరకు కేవలం 18దరఖాస్తులే నమోదు కావడం గమనార్హం. గత ఏడాది కంటే ఫీజును రూ.లక్ష పెంచడంతో కొత్తగా ఈ వ్యాపారంలో వచ్చేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదని సమాచారం. దీనికి తోడు స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున కొత్త వైన్స్‌కు డ్రా తీయబోరని.. పాత వాటిని పొడిగిస్తారనే ప్రచారం జరుగుతోంది. అలా కాకపోతే దరఖాస్తు స్వీకరణ గడువు పెంచుతారనే సమాచారంతో ఆశావహులు పలువురు ఊగిసలాటలో ఉన్నట్లు తెలుస్తోంది.



కౌంటర్లలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు

మూడు స్టేషన్ల పరిధిలో సున్నా

జిల్లాలోని ఆరు ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో 88 వైన్స్, 13 బార్‌షాపులు ఉన్నాయి. 2023 సంవత్సరంలో జరిగిన టెండర్లలో రూ.2 లక్షల ఫీజు ఉండగా 5,057 దరఖాస్తులు అందాయి. ఈసారి రూ.లక్ష ఫీజు పెంచగా గతంలో మాదిరి దరఖాస్తులు అందినా ఎక్సైజ్ శాఖకు ఆదాయం గణనీయంగా పెరుగుతుందని భావించారు. కానీ ఇప్పటివరకు 18దరఖాస్తులే అందాయి. అశ్వారావుపేట సర్కిల్ నుంచి 15, పాల్వంచ నుంచి రెండు, మణుగూరు నుంచి ఒక దరఖాస్తు ఉండగా, కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం స్టేషన్ల పరిధిలో ఒక్కటీ రాలేదు. ఈనెల 18వ తేదీ వరకు గడువు ఉండగా, 23వ తేదీన డ్రా తీసి వైన్స్ కేటాయిస్తారు. దీంతో నవంబర్ 30వ తేదీతో ముగిసే పాత షాపుల స్థానంలో డిసెంబర్ 1నుంచి కూడా కొత్త వైన్స్ ప్రారంభమవుతాయి.

మైక్రో బ్రేవరేజెస్..

గతంతో పోలిస్తే వైన్స్ టెండర్ల దరఖాస్తు ఫీజు రూ.లక్ష పెంచారు. దీంతో పాత వ్యాపారులే ముందుకొస్తుండగా.. సిండికేట్‌గా మారేందుకు వేచి చూసే ధోరణి అవలంబిస్తున్నారని, అందుకే టెండర్లు దాఖలు చేయడం లేదని తెలుస్తోంది. ఇక హోటళ్లు, రెస్టారెంట్లలో మైక్రో బ్రేవరేజెస్ ఏర్పాటుకు అనుమతించిన ప్రభుత్వం ఇటీవల దరఖాస్తులు స్వీకరించింది. ఇందుకు కేవలం రూ.లక్షే ఫీజు కావడంతో చాలా మంది వైన్స్ టెండర్లు ఆసక్తి చూపడం లేదని సమాచారం. కానీ ఎక్సైజ్ అధికారులు మాత్రం ఇంకా సమయం ఉన్నందున గత ఏడాది కంటే కూడా దరఖాస్తుల సంఖ్య పెరుగుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

క్రమంగా పెరిగే అవకాశం



కొత్త మద్యం దుకాణాలకు టెండర్ దాఖలు చేసే సమయం 18వ తేదీ వరకు ఉంది. అందుకే ఇప్పుడు తక్కువ దరఖాస్తులే వచ్చినా క్రమంగా పెరిగే అవకాశముంది. ఈ వారంలో దరఖాస్తులు ఎక్కువగా వస్తాయని భావిస్తున్నారు. స్టేషన్ల వారీగా దరఖాస్తు స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేశాం.

– జానయ్య, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్

ఆర్టీసీకి దసరా బొనాంజా!

- ఖమ్మం రీజియన్‌కు రూ.24.22 కోట్ల ఆదాయం
- 6వ తేదీన అత్యధికంగా రూ.2.18 కోట్ల రాబడి
- అవిశ్రాంతంగా పనిచేసిన డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది



ఖమ్మంమయూరిసెంటర్: దసరా పండుగ ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌కు కనకవర్షం కురిపించింది. పండుగ రద్దీ ఆధారంగా ఆర్ఎం సరిరామ్ ఆధ్వర్యాన ముందస్తు ప్రణాళికలు రూపొందించడమే కాక సిబ్బంది నిర్విరామంగా పనిచేయడంతో రాకపోకలు సాఫీగా సాగాయి. ఫలితంగా రీజియన్‌కు రూ.24,22,58,199 ఆదాయం లభించింది.

1,208 ప్రత్యేక బస్సులు..

బతుకమ్మ, దసరా పండుగలకు వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన ప్రజలు స్వస్థలాలకు రానున్నందున ముందుగానే డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లతో ఖమ్మం రీజియన్ మేనేజర్ సరిరామ్ పలు దఫాలు సమీక్షించారు. ఈమేరకు ప్రత్యేక బస్సులు నడిపేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. గతనెల 20 నుంచి ఈనెల 6వ తేదీ వరకు హైదరాబాద్ నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు, ఉమ్మడి జిల్లా నుంచి హైదరాబాద్‌కు బస్సులు నడిపారు. ప్రధానంగా హైదరాబాద్ నుంచి ఖమ్మం, మధిర, సత్తుపల్లి, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందుకు, ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు వేలాది మందిని చేర్చేలా 1,208 ప్రత్యేక సర్వీసులు రాకపోకలు సాగించాయి.

38.50లక్షల కి.మీ. ప్రయాణం

గత నెల 20వ తేదీ నుంచి ఈనెల 6వరకు హైదరాబాద్ నుంచి ఖమ్మం రీజియన్‌కు, ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు 38.50 లక్షల కి.మీ. బస్సులు తిరిగాయి. దీంతో ఆర్టీసీ రీజియన్‌కు మహాలక్ష్మితో కలిపి రూ.24.22 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో ప్రత్యేక సర్వీసుల ద్వారా రూ.4.15 కోట్లకు పైగా ఆదాయం వచ్చిందని అధికారులు వెల్లడించారు. కాగా, బతుకమ్మ, దసరా పండుగకు వచ్చివెళ్లే ప్రయాణికులకు సేవలందించేలా రీజియన్‌లోని ఏడు డిపోల డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, కార్మికులు, సూపర్‌వైజర్లు, డిపో మేనేజర్లు అవిశ్రాంతంగా పనిచేయడంతో ఎక్కడా లోటుపాట్లు ఎదురుకాలేదు.

ఒకేరోజు 3.17 లక్షల కిలోమీటర్లు

ఈ దసరా సెలవుల్లో ఖమ్మం రీజియన్ అధికారులు గత రికార్డులను బ్రేక్ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ నెల 6వ తేదీ సోమవారం ఒకే రోజు 3.17 లక్షల కి.మీ. మేర బస్సులు తిరగగా రూ.2.18 కోట్ల ఆదాయం రాబట్టారు. ఇందులో రీజియన్‌లోని ఖమ్మం డిపోకు అత్యధికంగా రూ.49 లక్షలు ఆదాయం రాగా, భద్రాచలానికి రూ.38.39 లక్షలు, సత్తుపల్లికి రూ.37.95లక్షలు, మధిరకు రూ.32 లక్షలు, మణుగూరుకు రూ.21.50 లక్షలు, కొత్తగూడెంకు రూ.21.50 లక్షలు, ఇల్లెందుకు రూ.11 లక్షలు ఆదాయం సమకూరింది.



భద్రాచలం బస్టాండ్‌లో ఈనెల 6న ప్రయాణికుల రద్దీ

ఆర్టీసీపై నమ్మకానికి నిదర్శనం



సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో ఆర్టీసీని మించి మరేది లేదని ప్రయాణికులకు ఉన్న నమ్మకం మరోమారు రుజువైంది. అందుకే పండుగ సెలవుల్లో గమ్యస్థానాలకు చేరేందుకు ఎక్కువ మంది ఆర్టీసీనే ఆశ్రయించారు. ఇందుకు అనుగుణంగా మా సిబ్బంది శ్రమించారు. రానున్న రోజుల్లోనూ ఇదే తరహాలో సేవలందిస్తాం.

– ఏ.సరిరామ్, ఆర్ఎం, ఖమ్మం రీజియన్

క్లుప్తంగా

ఆల్ ఇండియా ట్రెక్కింగ్ పోటీల్లో ప్రతిభ



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం, ఏఎన్‌ఓ

మణుగూరుటౌన్: ఆల్ ఇండియా ట్రెక్కింగ్ పోటీల్లో మణుగూరు సింగరేణి విద్యార్థులు ప్రతిభ చూపారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు హెచ్‌ఎం కల్యాణి ఎన్‌సీసీ ధ్రువపత్రాలను అందజేసి మాట్లాడారు. గత నెల 25 నుంచి అక్టోబర్ 2 వరకు తిరుపతిలో ఎన్‌సీసీ 8వ బెటాలియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్రెక్కింగ్ పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 102 మంది పాల్గొన్నారని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మణుగూరు సింగరేణి హైస్కూల్ నుంచి 8 మంది పాల్గొని ప్రతిభ చూపారన్నారు. శ్రీకృష్ణకౌశిక్ గ్రూప్ డ్యాన్స్‌లో బహుమతి సాధించాడని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల కోచ్, ఏఎన్‌ఓ కె.రాజసింహ, ఉపాధ్యాయుడు మస్తానయ్య ఉన్నారు.

పంట కాల్వల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న సర్వేయర్లు, అధికారులు

చంద్రుగొండ: సీతారామ ప్రాజెక్టు నుంచి పొలాలకు సాగునీరు అందించేందుకు నిర్మించనున్న కాల్వల నిర్మాణానికి భూసేకరణ నిమిత్తం సర్వే అధికారులు మంగళవారం మండలంలో పలు భూములను పరిశీలించారు. మద్దుకూరు, దామరచర్ల, గుర్రాయిగూడెం, చంద్రుగొండ, రావికంపాడు, గానుగపాడు, పోకలగూడెం గ్రామాల్లో మొత్తం 19 కిలోమీటర్ల మేరకు కాల్వలు నిర్మించనున్నామని, 400 ఎకరాల భూమి అవసరముంటుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్లు లక్ష్మణ్‌రావు, ప్రియాంక, జీపీఓ జగ్గయ్య, బొర్రా సురేశ్, మల్లం కృష్ణయ్య పాల్గొన్నారు.

ఫోరెన్సిక్ ల్యాబ్‌కు అస్థిపంజరం

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు మామిడితోటలో ఇటీవల లభ్యమైన మానవ అస్థిపంజరాన్ని పోలీసులు మంగళవారం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఈ అస్థిపంజరం ములకపాడు గ్రామానికి చెందిన సిద్ధి రవికుమార్‌దిగా గ్రామస్తులు, కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అయినప్పటికీ శాస్త్రీయ నిర్ధారణ కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు సీఐ వెంకటప్పయ్య తెలిపారు.

వరి పొలాలు పరిశీలించిన శాస్త్రవేత్తలు



వరిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలంలోని రాజాపురం, నామవరం, ఊటుపల్లి గ్రామాల్లో వరి పొలాలను కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. సుమారు 200 ఎకరాల్లో వరిపంటలో బెరుకులు వచ్చాయని రైతులు ఇటీవలే వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శాస్త్రవేత్తలు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పంటకు బ్యాక్టీరియల్ ఎండుతెగులు సోకినట్లు శాస్త్రవేత్తలు నిర్ధారించారు. పంటపై ప్లాంటోమైసిన్ మందు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు హేమంత్, భారత్, ఏఓ అనూష, ఏఈఓ సరిత, నాగేశ్వరరావు, కృష్ణంరాజు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌సీఎం చర్చి స్వర్ణోత్సవం



ప్రార్థన నిర్వహిస్తున్న ఫాదర్లు

ఇల్లెందు: పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి (పరిశుద్ధ జపమాల మాత దేవాలయం)లో స్వర్ణోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. చర్చి 50 వసంతాల వేడుకలను చర్చి ఫాదర్ ఎ.సునీల్ జయప్రకాష్ ఆధ్వర్యాన నిర్వహించగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. కార్యక్రమానికి ఖమ్మం పీఠాధిపతి డాక్టర్ సగిలి ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరవగా, అమృత రాజు, జయానంద్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,400

'వసతి'కి తాళం..

తెరుచుకోని హాస్టళ్లు.. వెలగని పొయ్యి

- దసరా సెలవులు ముగిసినా అదే పరిస్థితి
- కార్మికుల సమ్మెతో గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో ఇక్కట్లు
- ఆశ్రమ పాఠశాలలకూ నామమాత్రంగానే విద్యార్థులు





ఖమ్మం రేవతిసెంటర్‌లోని కళాశాల బాలుర వసతిగృహం వంట గదికి వేసిన తాళం (ఇన్‌సెట్) వసతిగృహం గది బయట చెత్తాచెదారం

ఖమ్మంమయూరిసెంటర్: వేతనాల సమస్యపై కొద్ది వారాలుగా కార్మికులు చేస్తున్న సమ్మెతో గిరిజన సంక్షేమ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో వంట గదులు తెరుచుకోలేదు. దసరా సెలవుల కన్నా ముందే కార్మికులు సమ్మెలోకి దిగడంతో విద్యార్థులకు ఆహారం అందించడం సమస్యగా మారింది. సెలవులు ముగిసేలోగా పరిస్థితులు చక్కబడతాయని భావించినా ఆ పరిస్థితి లేక జిల్లాలోని పలు గిరిజన సంక్షేమ వసతిగృహాలు తెరుచుకోలేదు. ఈ విషయం తెలిసి ఆశ్రమ పాఠశాలలకు విద్యార్థులు కూడా అంతంతమాత్రంగానే వచ్చారు. వేతనాల తగ్గింపు జీఓను రద్దు చేయాలనే డిమాండ్‌తో సమ్మెకు దిగిన కార్మికులు సమస్య పరిష్కారమయ్యే వరకు సమ్మె విరమించేది లేదని చెబుతున్నారు. ఈ ప్రభావం విద్యార్థులపై పడుతుండగా.. అధికారులు కూడా సమస్య ప్రభుత్వం, కమిషనర్ స్థాయిలో ఉన్నందున తామేమీ చేయలేమని చెబుతుండడం గమనార్హం.

రెండు రోజులైనా అదే పరిస్థితి..

కార్మికుల సమ్మె కాలంలో దసరా సెలవులు రావడంతో అటు గిరిజన శాఖ అధికారులు, ఇటు వసతి గృహ సంక్షేమ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ, సెలవులు ముగిసినా సమ్మె విరమింపజేయకపోవడంతో గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో పొయ్యిలు వెలగడం లేదు. ప్రీమెట్రిక్ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలలు ఈ నెల 4వ తేదీ శనివారం నుంచే తెరుచుకోవాల్సి ఉండగా సోమవారం నుంచి రావాలని విద్యార్థులకు సమాచారం ఇచ్చారు. కొన్ని ఆశ్రమ పాఠశాలలు, ప్రీ మెట్రిక్ వసతి గృహాల అధికారులు మాత్రం తాము చెప్పేవరకు రావొద్దని సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఇక పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలకు సంబంధించి కొన్ని వసతిగృహాలను మూసి ఉంచారు. ఖమ్మంలో ఏడు వసతిగృహాలు ఉండగా రెండు, మూడే తెరిచినట్లు తెలుస్తోంది.

బయటే టిఫిన్, భోజనం

రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సంక్షేమశాఖ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్, డెయిలీ వేజ్ కార్మికుల సమ్మెతో వసతిగృహాల్లో పనులు నిలిచిపోయాయి. చాలా వసతిగృహాల్లో ఇద్దరు, ముగ్గురు డెయిలీ వేజ్, ఔట్ సోర్సింగ్ కార్మికులే ఉన్నారు. దీంతో చాలా వాటిని మూసి ఉంచగా, కొన్నింటిని తెరిచినా వంట చేయడం లేదని తెలుస్తోంది. ఖమ్మం రేవతి సెంటర్‌లోని ఏటీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న గిరిజన సంక్షేమశాఖ ఖమ్మం రూరల్ కళాశాల బాలుర వసతిగృహంలో వంట గది తాళం తెరుచుకోలేదు. దీంతో వచ్చిన విద్యార్థులు టిఫిన్, భోజనం బయటే చేస్తున్నారు. ఏటీడీఓ కార్యాలయ ఆవరణలోని వసతిగృహం ఇలా ఉంటే మిగతా వాటి పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

విద్యార్థులపై ప్రభావం

కార్మికుల సమ్మె ప్రభావం విద్యార్థులపై పడుతోంది. దసరా సెలవుల అనంతరం పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభమైనా వసతిగృహాలు తెరుచుకోలేదు. దీంతో విద్యార్థులు ఇళ్లకే పరిమితమయ్యారు. మారుమూల గ్రామాలకు చెందిన వారు ఖమ్మం కళాశాలల్లో చదువుతుండగా వీరికి ఇక్కట్లు ఎదురవుతున్నాయి. కార్మికుల సమ్మెతో భోజనం సిద్ధం చేయించే పరిస్థితి లేక ఆశ్రమ పాఠశాలలకు రావొద్దని సమాచారం ఇచ్చినా త్వరలో జరగనున్న సమ్మెటివ్ పరీక్షల పరిస్థితి ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. ఇకనైనా ప్రభుత్వం కార్మికుల సమస్యకు పరిష్కారం చూపాలని తల్లిదండ్రులు, నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాల

హాస్టల్	ఖమ్మం	భద్రాద్రి
పోస్ట్ మెట్రిక్ వసతిగృహాలు	12	22
ప్రీ మెట్రిక్ వసతిగృహాలు	08	17
ఆశ్రమ పాఠశాలలు	10	86

సమస్యను పరిష్కరించాలి..



కార్మికుల సమస్యను పరిష్కరించి విద్యార్థులకు న్యాయం చేయాలి. కార్మికులు లేరనే సాకుతో కొన్ని వసతిగృహాలను తెరవకపోవడం సరి కాదు. సెలవులు ముగియగానే వసతిగృహాలను తెరిపించాల్సిన అధికారులు పట్టింపులేనట్లు వ్యవహరించడం గర్హనీయం.

–ఇటికాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి

వసతిగృహాల్లో వంట చేయించాలి..



వసతిగృహాలకు వస్తున్న విద్యార్థులకు భోజనం పెట్టడం లేదు. కార్మికులు లేరని వంట గదులు కూడా తెరవలేదు. అధికారులు వెంటనే కార్మికులను ఏర్పాటుచేసి విద్యార్థులకు భోజనం అందేలా చూడాలి. జిల్లా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

–వి.వెంకటేశ్, పీడీఎస్‌యూ, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఆర్చరీ, కబడ్డీ, రెజ్లింగ్ జట్ల ఎంపిక



ఉమ్మడి జిల్లా బాలికల కబడ్డీ జట్టు

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా జూనియర్ కళాశాలల క్రీడా సంఘం ఆధ్వర్యాన వివిధ క్రీడల ఉమ్మడి జిల్లాస్థాయి జట్ల ఎంపికకు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో మంగళవారం పోటీలు నిర్వహించారు. కబడ్డీ జట్ల ఎంపికకు 110 మంది బాల బాలికలు, ఆర్చరీ జట్ల ఎంపికకు 20 మంది, రెజ్లింగ్ ఎంపికకు 25 మంది హాజరయ్యారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్న జట్ల ఎంపిక పోటీలను కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.క్రిస్టోఫర్‌బాబు, ఖేలో ఇండియా ఖమ్మం సెంటర్ కోచ్ నగేశ్, క్రీడా సంఘం కార్యదర్శి ఎండీ మూసీకలీం పర్యవేక్షించారు.

- జిల్లా బాలుర కబడ్డీ జట్టులో బి.కౌశిక్, జి.వినయ్, పి.మనోహర్, వి.సాయికిరణ్, ఐ.కుమార్, ఆర్.రాకేశ్, జి.గణేశ్, కె.భార్గవ్‌రెడ్డి, ఈ.అజయ్ కుమార్, బి.మధు, డి.సాయికిరణ్, సాయికృష్ణ, వి.వివేక్, ఎల్.అరవింద్, బి.శరత్, డి.ధనుష్, డి.ఆనంద్‌కిశోర్ స్థానం దక్కించుకున్నారు.
- బాలికల కబడ్డీ జట్టుకు జి.మైత్రీ, బి.కుసుమ, బి.పల్లవి, ఎస్‌కే వాదాహసీనా, ఎస్.పల్లవి, జి.సాహితి, జి.హరిణి, టి.వినీల, ఎస్.భావ్యశ్రీ, కె.ప్రత్యూష, ఎస్‌కే రిజ్వాన, ఆర్.శ్రీలత, జి.యశస్విని, స్నేహ, కె.ఇందు, ఎండీ ఆసియా, ఎల్.మిత్ర, కె.సోమక్క ఎంపికయ్యారు.
- జిల్లా ఆర్చరీ బాలుర జట్టులో ముల్కి చరణ్, ఆర్.బార్గవ్, బి.హరికృష్ణ, ఎ.కొండల్‌రాయ్, బాలికల జట్టులో టి.వీరభద్రమ్మ, కుంజ భవ్యకు స్థానం దక్కింది.
- రెజ్లింగ్ బాలుర జట్టులో ఎ.విష్ణువర్దన్, జి.యువరాజ్, ఎస్.వివేక్‌వర్ధన్, బి.మణిచరణ్, పి.శివతేజ్ నందన్, పి.జయదేవ్, పి.గణేశ్, వి.ఉదయ్‌కిరణ్, కె.లిఖిత్ చరణ్, ఎం.అమేశ్ బహాదుర్, ఎస్.చరణ్ రాజ్, బాలికల జట్టులో జి.వర్షిత, కె.దీక్షిత, ఆర్.గీత హర్షిణి స్థానం దక్కించుకున్నారు.

జెడ్పీ పీఠాన్ని కైవసం చేసుకుంటాం..

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



ములకలపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు

ములకలపల్లి/పినపాక/మణుగూరురూరల్: రానున్న ఎన్నికల్లో జిల్లాలోని అత్యధిక జెడ్పీటీసీ సీట్లు దక్కించుకుని జిల్లా పరిషత్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవడమే కాక ఎంపీటీసీలు, సర్పంచ్ స్థానాల్లోనూ విజయమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తెలిపారు. ములకలపల్లి, పినపాక మండలం ఈ–బయ్యారం, మణుగూరుల్లో మంగళవారం పార్టీ శ్రేణులతో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నా చేసిన అభివృద్ధి ఏమీ లేదని ఆరోపించారు. జిల్లాలో సింగరేణి తదితర సంస్థల నుంచి రావాల్సిన డీఎంఎఫ్‌టీ, సీఎస్‌ఆర్ నిధులు రాబట్టడంలో విఫలమయ్యారని తెలిపారు. ఇదే సమయాన ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలమైన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను నిలదీసేలా ఇంటింట అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కనీసం రైతులకు యూరియా అందించలేని విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. కాగా, ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న తీవ్ర వ్యతిరేకతను ఓట్ల రూపంలో మలుచుకుంటే బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయం సులువవుతుందని కాంతారావు వెల్లడించారు. ఈ సందర్భంగా ఈ–బయ్యారంలో జరిగిన సమావేశంలో దుగ్నేపల్లికి చెందిన 20 కుటుంబాలు బీఆర్‌ఎస్‌లో చేరాయి. సమావేశాల్లో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, నాయకులు మోరంపూడి అప్పారావు, సతీశ్‌రెడ్డి, కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్, ఎడ్ల శ్రీనివాస్, వట్టం రాంబాబు, అడపా అప్పారావు, యూసుఫ్ షరీఫ్, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, ప్రభుదాస్, అక్కి నర్సింహారావు, వేర్పుల సురేశ్, గువ్వా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై అమానవీయ యుద్ధం

సంఘీభావ సదస్సులో అఖిలపక్షం నేతలు



పాలస్తీనా పౌరుల మృతికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఇల్లెందు: అత్యంత చిన్నదేశమైన పాలస్తీనాపై అగ్రరాజ్యం అండతో ఇజ్రాయిల్ రెండేళ్లుగా యుద్ధం కొనసాగిస్తూ మహిళలు, చిన్న పిల్లలను అమానవీయంగా హతమారుస్తుండడం గర్హనీయమని వివిధ పార్టీల నాయకులు పేర్కొన్నారు. ఇల్లెందులో మంగళవారం పాలస్తీనా సంఘీభావ సదస్సు జరగగా, ఎన్‌డీ రాష్ట్ర నాయకుడు గౌని ఐలయ్య మాట్లాడారు. ఇజ్రాయిల్ సాగిస్తున్న ఏకపక్ష దాడులతో అమాయక పాలస్తీనా పౌరులు మృత్యువాత పడుతున్నారని తెలిపారు. కనీసం తాగునీరు, ఆహారం, మందులు కూడా ఇజ్రాయిల్ అందనివ్వడం లేనందున యుద్ధం నిలిపివేసేలా అన్ని దేశాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, పౌరులంతా పాలస్తీనా ప్రజలకు అండగా నిలవాలని కోరారు. ఎన్‌డీ రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధు అధ్యక్షతన జరిగిన సదస్సులో మాస్‌లైన్, సీపీఎం, సీపీఐ, తదితర పార్టీల నాయకులు చంద్ర అరుణ, ఏఎస్ నబీ, డి.శంకర్, రాంసింగ్, ఎ.సాంబ, దొడ్డా డానియల్, సిలివేరు సత్యనారాయణ, టి.నాగేశ్వరరావు, నాయిని రాజు, బందం నాగయ్య, కిరణ్, కృష్ణ, సత్యనారాయణ, జాఫర్, కె.సారంగపాణి, యాకూబ్‌షావలీ, కాంపాటి పృథ్వీ, బాస శ్రీనివాస్, గణేశ్, అభిమన్యు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీ విష్ణుమూర్తికి అంతిమ వీడ్కోలు

నివాళులర్పించిన ఎస్పీ, ఎమ్మెల్యేలు



విష్ణుమూర్తి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్, ఉద్యోగులు

జూలూరుపాడు: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్న సబ్బతి విష్ణుమూర్తి హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందిన విషయం విదితమే. స్వస్థలమైన జూలూరుపాడుకు ఆయన మృతదేహాన్ని మంగళవారం తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వైరా, కొత్తగూడెం ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్ నాయక్, కూనంనేని సాంబశివరావు, ఎస్పీ రోహిత్‌రాజ్ ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. అలాగే, ఖమ్మం అదనపు డీసీపీ రామానుజం, ఇంటిలిజెన్స్ అడిషనల్ ఎస్పీ రామోజీ రమేశ్, డీఎస్పీలు నాగన్న, అబ్దుల్ రెహమాన్, సీఐలు శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి, రిటైర్డ్ పోలీస్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాసరావు తదితరులు నివాళులర్పించారు. అలాగే, వివిధ పార్టీల నాయకులు, ఉద్యోగులు సైతం విష్ణుమూర్తి మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబాన్ని పరామర్శించారు. కాగా, విష్ణుమూర్తి అంత్యక్రియలను పోలీస్ లాంఛనాలతో నిర్వహించాలని వరంగల్ నార్త్ జోన్ డీఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి దృష్టికి ఎమ్మెల్యే రాందాస్ తీసుకెళ్లారు. దీంతో ఆయన అంత్యక్రియలు అధికార లాంఛనాలతో జరిగాయి.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కొత్తగూడెంటౌన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీ.ఆర్.గవాయ్‌పై దాడికి నిరసనగా మంగళవారం కొత్తగూడెం కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ మాట్లాడుతూ సీజేఐపై దాడి జరగడం భారత న్యాయ చరిత్రలో చీకటి అధ్యాయమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జె.గోపీకృష్ణ, న్యాయవాదులు మాధవరావు, కాసాని రమేష్, ఉప్పు అరుణ్, కె.కృష్ణప్రసాద్, ఆడపాల పార్వతి, మాలోతు ప్రసా ద్, ఉటుకూరి పురుషోత్తంరావు, పి.నిరంజన్‌రావు, ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, పాండు రంగ విఠల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం న్యాయవాదులు కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కూడా నిరసన తెలపగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, ఎర్రా కామేశ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

సీఎస్‌ఆర్ విధివిధానాలపై సమీక్ష



కొత్తగూడెం నుంచి వీసీకి హాజరైన అధికారులు

కొత్తగూడెంఅర్బన్: కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి రూపేందర్ న్యూఢిల్లీ నుంచి మంగళవారం కోల్ ఇండియా పరిధి బొగ్గు సంస్థలు, మైనింగ్ కంపెనీల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్‌ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) విధివిధానాలపై సమీక్ష నిర్వహించారు. ఈ వీసీలో సింగరేణి సంస్థ తరఫున హైదరాబాద్ సింగరేణి భవన్ నుండి డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు, కొత్తగూడెం కార్యాలయం నుండి జీఎం(పర్సనల్) వెల్ఫేర్ – సీఎస్‌ఆర్ జీ.వీ.కిరణ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బొగ్గు రంగంలో సీఎస్‌ఆర్ నిధుల కేటాయింపు, వినియోగంపై చర్చించి సూచనలు చేశారు. ఇంకా ఈ సమావేశంలో సింగరేణి అధికారులు బి.గట్టుస్వామి, గౌస్‌పాషా, రవికిశోర్ పాల్గొన్నారు.

బడి.. బహుదూరం..

ఈ ఫొటోలో కనిపిస్తున్న వీరంతా వలస గొత్తికోయ చిన్నారులు.. అడవే వీరికి ఆవాసం. ఈ చిన్నారులు చదువుకోవాలంటే దూరంలో ఉన్న ఆశ్రమ పాఠశాల బాట పట్టాల్సిందే. అశ్వారావుపేట మండలంలోని మొద్దులమడ పంచాయతీ పరిధిలోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఎత్తయిన కొండపై ఉన్న పెద్దమిద్దె గ్రామంలో ఏళ్లుగా వలస గొత్తికోయలు నివాసం ఉంటున్నారు. ఈ గ్రామానికి వెళ్లేందుకు రహదారితోపాటు ప్రభుత్వ పాఠశాల కుడా లేదు. బడి ఈడు చిన్నారులు ఏటా చదువు కోసం సుమారు 50 కిలోమీటర్ల దూరంలోని కావడిగుండ్ల ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలకు రావాల్సిందే. దూర భారం కావడంతో సెలవులు వస్తే చిన్నారులు స్వగ్రామానికి వెళ్లి తిరిగి పాఠశాల తెరుచుకున్న తర్వాత రావడం లేదు. దీంతో ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు నరసింహారావు స్వయంగా పెద్దమిద్దె గ్రామానికి మొద్దులమడ నుంచి కాలినడకన వెళ్లి చిన్నారులను తిరిగి పాఠశాలకు తీసుకొస్తున్నారు.

–అశ్వారావుపేటరూరల్



పెద్దమిద్దె నుంచి తీసుకొచ్చిన చిన్నారులతో ఉపాధ్యాయుడు

రేషన్ బియ్యం పట్టివేత

టేకులపల్లి: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాలశాఖ అధికారి పట్టుకున్న ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన భూక్య పాండు నివాసంలో రేషన్ బియ్యం నిల్వ ఉంచాడనే సమాచారం మేరకు ఇల్లెందు డీటీ యాకూబ్‌పాషా, టెక్నికల్ మేనేజర్ విజయ్ సోదాలు నిర్వహించారు. పది బస్తాల్లో రేషన్ బియ్యాన్ని గుర్తించి వాటిని సీజ్ చేసి తూకం వేయగా 5 క్వింటాళ్లుగా తేలింది. అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచిన పాండుపై 6ఏ కేసు నమోదు చేశామని, సీజ్ చేసిన బియ్యాన్ని టేకులపల్లి రేషన్ డీలర్ వెంకటేశ్‌కు అప్పగించామని డీటీ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బూర్గంపాడు: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను మంగళవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని బుడ్డగూడెం సమీపంలో కిన్నెరసాని నుంచి నాలుగు ఇసుక ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా.. పక్కా సమాచారంతో పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎనిమిదిమందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు.

ఇసుక లారీ సీజ్

ములకలపల్లి: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు సీజ్ చేశారు. మండలంలోని రింగిరెడ్డిపల్లి సమీపాన మంగళవారం లారీని తనిఖీ చేయగా ఇసుక తరలింపునకు అనుమతి లేదని తేలడంతో సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఏపీలోని ఇబ్రహీంపట్నం నుంచి హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు.

లింక్ క్లిక్ చేస్తే.. నగదు స్వాహా

పాల్వంచరూరల్: సెల్‌ఫోన్‌కు వచ్చిన టెలిగ్రామ్ యాప్‌ను పలుమార్లు క్లిక్ చేసిన వ్యక్తి.. తన ఖాతా నుంచి రూ.1.25 లక్షలు పోగొట్టుకున్న ఘటన మంగళవారం మండలంలో వెలుగుచూసింది. పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన మాలోత్ పవన్ తన సెల్‌ఫోన్‌కు వచ్చిన టెలిగ్రామ్ యాప్‌ను పలుమార్లు క్లిక్ చేయగా ఒక సారి రూ.40 వేలు, మరోసారి 20 వేలు.. ఇలా రూ.1.25 లక్షలు తన ఖాతాలో నుంచి పోగొట్టుకున్నాడు. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సైబర్ క్రైమ్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

అక్రమంగా నిల్వ చేసిన బాణసంచా స్వాధీనం

భద్రాచలంటౌన్: ఎలాంటి అనుమతులు లేకుండా నిల్వ చేసిన బాణసంచాను టాస్క్‌ఫోర్స్, పట్టణ పోలీసుల సంయుక్త తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నారు. పట్టణ ఎస్‌ఐ రామకృష్ణ కథనం ప్రకారం.. పట్టణంలో నాలుగు చోట్ల అనుమతులు లేకుండా భారీగా బాణసంచా నిల్వ చేశారనే సమాచారంతో తనిఖీలు చేపట్టామని తెలిపారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం చేపట్టిన తనిఖీల్లో సుమారు రూ.5 లక్షల విలువైన బాణసంచా పట్టుబడిందని పేర్కొన్నారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం నిందితులపై కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

ఆలయంలో చోరీ

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని భగవాన్‌దాస్‌కాలనీలోని ముత్యాలమ్మ ఆలయం తాళాలు పగులకొట్టి లోపలికి చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు హుండీలోని నగదు చోరీ చేశారు. సోమవారం అర్ధరాత్రి ఘటన జరగగా మంగళవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. ఆలయానికి వచ్చిన అర్చకుడు తాళాలు పగలకొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలాన్ని సందర్శించి, సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాలను స్వాధీనం చేసుకున్నారు. ఆలయ కమిటీ బాధ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వారం క్రితం ఇదే కాలనీలో మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఇంటి ఆవరణలో ఏర్పాటు అమ్మవారి మండపంలో హుండీ చోరీకి గురైంది. వారం వ్యవధిలో రెండు చోరీలు జరగడంతో పట్టణవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు.